క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

మాచర్ల: మాచర్ల ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం శనివారం జరుగుతుందని డీఎం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచర్ల పట్టణం, పరిసర ప్రాంతాల ప్రయాణికులు 99592 25432 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి తమ ఇబ్బందులు, సూచనలు తెలియజేయవచ్చన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కాల్ చేయొచ్చని పేర్కొన్నారు.

పునఃప్రతిష్ట పూజలు ప్రారంభం



దాచేపల్లి: మండలంలోని గామాలపాడు గ్రామంలో మహా శైవక్షేత్రం పునఃప్రతిష్ట పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పల్నాటి నాయకురాలు నాగమ్మ నాడు నిర్మించిన మహా శైవక్షేత్రం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పునఃప్రతిష్టకు నిర్ణయించారు. ఈ మహోత్సవం ఈ నెల 16వ తేదీన జరుగనుంది. మూడు రోజులపాటు జరిగే గణపతి హోమం, చండీ హోమం తదితర పూజలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, సర్పంచ్ జంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు అధికంగా తరలివచ్చే అవకాశం ఉండటంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ పంపిణీ



గురజాల: విద్యార్థులకు పదో తరగతి తొలి మెట్టు అని, చదువుతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని అందరూ గుర్తించాలని ఏఎస్ డబ్ల్యూఓ సుజాత సూచించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహంలో శుక్రవారం విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. రెంటచింతల, గురజాలకు చెందిన 110 మంది విద్యార్థులు వీటిని అందుకున్నారు.

రెంటచింతల: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని సహాయ సాంఘిక సంక్షేమ అధికారి టీవీ సుజాత కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో 110 మంది పదో తరగతి విద్యార్థులకు ఆమె ముఖ్య అతిథిగా ఎగ్జామ్ ప్యాడ్లు, రిస్ట్‌వాచ్‌లు పంపిణీ చేశారు. సాయం అందించినందుకు ఎస్‌బీఐ మేనేజర్ వి.ఆంజనేయులు, పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ తరఫున మారుతి నాగార్జున, సత్యవతి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సంక్షేమ వసతి గృహాల అధికారులు జె. అరుణ కుమారి, నూరెల్లాబేగ్, గోపాల్‌నాయక్, మాధవీలత, శిరోమణి, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస ప్రార్థన ఎంతో పవిత్రం



దాచేపల్లి: ఉపవాస ప్రార్థన పరలోక ప్రాప్తిని అనుగ్రహిస్తుందని పాస్టర్ తగరం ప్రేమయ్య అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం ఉపవాస ప్రార్థన నిర్వహించారు. దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రేమయ్య మాట్లాడుతూ.. ఉపవాస ప్రార్థన ఎంతో పవిత్రమైందన్నారు. అనంతరం ఉపవాసం ఉన్న విశ్వాసులు ప్రేమవిందు ఆరగించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు నాగెండ్ల రత్నం, పురుషోత్తం, మాతంగి రాంబాబు, ఆనందరావు, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం అధ్యక్షుడిగా అంజిరెడ్డి



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న కుంటి మల్లారెడ్డి అఖిల భారత సంక్షేమ రెడ్ల అన్నదాన సత్రం అధ్యక్షుడిగా మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన గొట్టం అంజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు పులి ఓబుల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడిగా గాదె వీరారెడ్డి (కంభంపాడు), కార్యదర్శిగా మందలపు వెంకటరెడ్డి (పాలువాయి), ట్రెజరర్‌గా నెవలి సీతారామిరెడ్డి (మంచికల్లు), సహాయ కార్యదర్శిగా చపారపు విజయ భాస్కర్‌రెడ్డి (రెంటచింతల)లను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ పాలక వర్గం రెండు సంవత్సరాలు కొనసాగుతుందన్నారు.

వ్యక్తి అదృశ్యం

గురజాల రూరల్: వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని తేలుకుట్ల గ్రామానికి చెందిన లోకసాని శివారెడ్డి ఈ నెల 10వ తేదీన గురజాలకని బయటకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ రోజు రాత్రి రాకపోవడంతో బంధువుల ఇళ్లకు ఏమైనా వెళ్లాడా అని కుటుంబసభ్యులు వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.


లోడు దించుకోండిలా..!

- విద్యుత్ వినియోగదారులకు సదవకాశం
- దాదాపు సగం రాయితీ కల్పించిన విద్యుత్ శాఖ

గురజాల: కొన్ని దశాబ్దాల క్రితం విద్యుత్ కనెక్షన్ ఉన్న ఇంటిలో ఎక్కువగా ఒక బల్బు, ఒకటీఅరా ఫ్యాన్ వినియోగంలో ఉండేవి. ప్రస్తుతం విద్యుత్ పరికరాల వినియోగం పెరిగిపోవడంతో వాడకం ఎక్కువైంది. గతం పది సంవత్సరాలతో పోల్చితే విద్యుత్ వాడకం ఇప్పుడు మూడింతలు పెరిగిందనే చెప్పవచ్చు. దీని వలన నాణ్యమైన విద్యుత్ అందుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫ్యాన్ల స్థానంలో ఏసీలు పెరిగిపోయాయి. వేడి నీటికి హీటర్లు, దుస్తులు ఉతికేందుకు వాషింగ్ మెషీన్లు, పిండి రుబ్బడానికి గ్రైండర్‌లు సర్వసాధారణం అయ్యాయి. మోటారు సైకిళ్లు, కార్లు సైతం విద్యుత్ ద్వారా చార్జింగ్ చేసుకుంటున్నారు.

లోవోల్టేజీ సమస్యలు దూరం

ఈ నేపథ్యంలో వినియోగించే విద్యుత్‌ను క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు దాదాపు సగం రాయితీ కల్పిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. గృహ విద్యుత్ అవసరాలకు కనెక్షన్ ఇచ్చే సమయంలో వాడే లైట్లు, గృహోపకరణాల అవసరాలను అంచనా వేసి కిలోవాట్‌ల లెక్కన డెవలప్‌మెంట్ చార్జీ, సెక్యూరిటీ డిపాజిట్ కట్టించుకునే వారు. దాని కంటే ఎక్కువే వినియోగదారుల వాడకం పెరిగింది. అధికంగా విద్యుత్ పరికరాలు వాడకం వలన తక్కువ లోడు కోసం ఏర్పాటు చేసిన పరివర్తకాలు తరుచూ ట్రిప్ అయి లోవోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. వినియోగదారులు కూడా తరుచూ ఇబ్బందులు పడుతున్నారు.



విద్యుత్ మీటర్

క్రమబద్ధీకరణకు ఇచ్చే రాయితీ వివరాలు

అదనపు లోడు (కిలోవాట్)	అసలు ధర (రూ.లలో)	తగ్గింపు ధర (రూ.లలో)
1	2,250	1,250
2	4,450	2,450
3	6,650	3,650
4	8,850	4,850

సద్వినియోగం చేసుకోవాలి



విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లోడు క్రమబద్ధీకరణ చేసుకోవడం మంచిది. అన్ని విధాలుగా వినియోగదారులకు మేలు జరుగుతుంది. జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఉంది. తద్వారా లోవోల్టేజ్ సమస్య నుంచి విముక్తి పొందొచ్చు.

– మారాసు శ్రీనివాసరావు, ఏడీఈ, విద్యుత్ శాఖ, గురజాల

విద్యుత్ మీటర్ల వివరాలు

మండలం	విద్యుత్ కనెక్షన్లు
గురజాల	27,284
దాచేపల్లి	25,389
మాచవరం	17,950
పిడుగురాళ్ల పట్టణం	28,750
పిడుగురాళ్ల రూరల్	14,550
మొత్తం	1,13,923

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీపీ గార్లపాటి అనసూర్య

పిడుగురాళ్ల రూరల్: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గార్లపాటి అనసూర్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీడీవో రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో చేతి పంపులను బాగు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈపీఆర్డీ దయాసాగర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల జీతాలు సక్రమంగా అందించాలన్నారు. వారికి రెండు జతల దుస్తులు, టవల్స్, సంవత్సరానికి పన్నెండు కేజీల కొబ్బరి నూనె, రెండు జతల గ్లౌజులు అందించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ విషయంపై చెన్నాయపాలెం ఎంపీటీసీ రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కార్మికులకు ప్రతి నెల జీతాలు చెల్లించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సోమయ్య మాట్లాడుతూ.. జానపాడు, గుత్తికొండ, తుమ్మలచెరువు, పందిటివారిపాలెం, వీరాపురం గ్రామాల్లో తాగునీటి చెరువులు నిండుగా ఉన్నాయని గుర్తుచేశారు. ఇంకా కుంటలు ఉంటే నింపడానికి గ్రామ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏపీఎం, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీపీ గార్లపాటి అనసూర్య, ఎంపీడీవో రామచంద్రరావు

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి

సీఐటీయూ జిల్లా నాయకులు జి.రవిబాబు

క్రోసూరు: స్కీం వర్కర్లు చిరుద్యోగులైన అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, వీవోఏ తదితర వారిపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా నాయకులు జి.రవిబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం రాజకీయ వేధింపులు ఆపాలని స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ప్రతి సందర్భంలో చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు జరపడం అన్యాయమని అన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా చిరుద్యోగులను వేధించడం దుర్మార్గమని, రాజకీయ వేధింపుల వలన అమరావతి మండలం ఉంగుటూరు గ్రామంలో ఆశ వర్కర్ రాయపాటి సామ్రాజ్యం ఆత్మహత్యాయత్నం, అదేవిధంగా నకరికల్లు మండలం పాపిశెట్టిపాలెనికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని వీటికి కారణం ఆయా శాఖల అధికారులు రాజకీయ వేధింపులకు పాల్పడే వారికి అనుకూలంగా వ్యవహరించడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు బి.జయలక్ష్మి, జి.శివపార్వతి, శ్యామల, కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావు, ఏపూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

సంస్మరణ సభను జయప్రదం చేయండి

అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి

పెదకూరపాడు: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవాల్లో భాగంగా ఈ నెల 16న పెదకూరపాడులో జరిగే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ కోరారు. పెదకూరపాడులోని సీపీఐ, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పెదకూరపాడు ప్రాంతంలో విశిష్ట సేవలు అందించిన మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ దర్శి లక్షయ్య, కామ్రేడ్ అంబటి హనుమంతురావు, కామ్రేడ్ దర్శి పానకాలరావు, కామ్రేడ్ డాక్టర్ పఠాన్ హుస్సేన్‌ఖాన్, కామ్రేడ్ తురకా చిన్నప్ప, కామ్రేడ్ షేక్ నాగూల్‌మీరా, కామ్రేడ్ కొమ్మాలపాటి అప్పారావు, కామ్రేడ్ యెరుకూరి వెంకట అప్పారావు, కామ్రేడ్ దర్శి వెంకట్రావు, కామ్రేడ్ మునిపల్లి ప్రభాకర్, కామ్రేడ్ షేక్ షంషుద్దీన్‌లను స్మరించుకుంటూ ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, షేక్ హుస్సేన్, భైరవపట్నం రామకృష్ణలతో పాటు ప్రజా నాట్య మండలి బృందం పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమ్మాలపాటి రమేష్, మునగోటి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతి శ్రీ

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలిక

యడ్లపాడు: బాలిక తప్పిపోయిన ఘటనను సవాలుగా తీసుకున్న పోలీసులు, కేవలం రెండు గంటల్లోనే బాలిక ఆచూకీని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం... యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన భూక్య శంకర్‌నాయక్ కుమార్తె చిలకలూరిపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో బాలిక కనిపించకుండా పోయింది. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బారాయుడు, తన సిబ్బందితో కలిసి వెంటనే గాలింపు ప్రారంభించారు. సమర్థవంతమైన అన్వేషణ అనంతరం కేవలం రెండు గంటల్లోనే మార్టూరులో బాలికను గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమార్తెను క్షేమంగా తీసుకువచ్చి అప్పగించిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



కుటుంబ సభ్యుడికి బాలికను అప్పగించిన మహిళా పోలీస్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: పట్టణంలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ మాచర్ల పట్టణ అసిస్టెంట్ ఇంజినీర్ శుక్రవారం తెలిపారు. మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పట్టణంలోని చెన్నకేశవ స్వామి గుడి, కన్యకా పరమేశ్వరి ఆలయం తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

వైభవంగా నరసింహ స్వామి కల్యాణం



మాచవరం: మండలంలోని సింగరాయపాలెం తండా గ్రామ సమీపంలోని సింగరుట్ల కొండపై వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీసింగరుట్ల లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పిల్లుట్ల, కొత్తగణేశునిపాడు, సింగరాయపాలెం తండా గ్రామాలకు చెందిన దంపతులు పీటలపై కూర్చొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. కర్పూరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అన్నదానం నిర్వహించింది.

ఉచిత ఈఏపీసెట్ శిక్షణ

పిడుగురాళ్ల: పట్టణ శివారులోని కేఎస్‌ఆర్ విద్యా సంస్థలలో పీఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావుల ఆధ్వర్యంలో ఉచిత ఏపీఈఏపీ సెట్ క్లాసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 24 నుంచి క్లాసులు ఉంటాయన్నారు. 98662 49110, 90305 62102 ఫోను నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు ఓబన్న విగ్రహావిష్కరణ

మాచర్ల: సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం 16వ తేదీన ఉదయం 10 గంటలకు జరుగుతుందని టీడీపీ వడ్డెర సాధికార సమితి మాచర్ల పట్టణ అధ్యక్షుడు మంజుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు ఓబన్న అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



పిడుగురాళ్ల: అరటికాయల వ్యాపారిని జేసీబీ ఢీకొన్న సంఘటనలో అతని కాలు విరిగింది. జానపాడు రోడ్డులోని రైల్వే గేటు సమీపంలో శుక్రవారం ఈ దుర్ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పిడుగురాళ్ల పట్టణం నుంచి తోపుడు బండిపై అరటి కాయలు అమ్ముకునే వ్యక్తి జానపాడు రోడ్డులోని రైల్వే గేటు దాటి ముందుకు వెళ్లాడు. వెనుక వస్తున్న జేసీబీ అతడిని ఢీకొట్టడంతో ఓ కాలి పాదం తెగిపడింది. పోలీసులు వచ్చి అంబులెన్స్‌లో పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. దీనిపై ఫిర్యాదు నమోదు కాలేదని పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు తెలిపారు.

సందడిగా హోలీ పండుగ



పిడుగురాళ్ల: పట్టణంలో శుక్రవారం హోలీ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులు రంగులను చల్లుకుంటూ సందడి చేశారు. పరస్పరం హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

నేడు అంకమ్మతల్లి దేవాలయ పునర్నిర్మాణ మహోత్సవం

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో వేంచేసియున్న శిథిలమైన అంకమ్మతల్లి దేవాలయాన్ని గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్తల సహాయ సహకారాలతో పునర్నిర్మించారు. అందులో అంకమ్మతల్లి విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం కార్యక్రమం జరుగనుంది.

మహిళలను మోసగించిన జనసేన

గురజాల వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: జనసేన ఆవిర్భావ దినోత్సవం రోజున మహిళలకు ఎందుకు బొట్టు పెట్టి ఆహ్వానించారో అర్థం కావటం లేదని గురజాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. మహిళలను జనసేన అన్నివిధాలా మోసగించిందని ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జన సైనికులు, వీర మహిళలు ఎందుకు వేడుకలకు హాజరవ్వాలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పాలన్నారు. రాష్ట్రంలో సుమారు 30 వేల మంది ఆడపడుచులు మిస్ అయ్యారని పవన్ గతంలో ఆరోపించారని, డిప్యూటీ సీఎం అయ్యాక వారి ఆచూకీని ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. దళిత యువతి సుగాలి ప్రీతి అనుమానాస్పద మృతి కేసును నేటికీ ఎందుకు ఛేదించలేదని నిలదీశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులో జాప్యం గురించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ

నరసరావుపేట రూరల్: యల్లమందలోని జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల ఆవరణలో శుక్రవారం సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల లో 1988 నుంచి 92 మధ్య కాలంలో ఏడు నుంచి పదవ తరగతి చదివిన విద్యార్థులు కార్యక్రమానికి సహకరించారు. అలాగే పాఠశాల పూర్వవిద్యార్థులు కడియాల వీరయ్య, కడియాల కిరణ్‌కుమార్‌ల సహకారంతో డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉయ్యాల పార్వతి, పూర్వ ప్రధానోపాధ్యాయుడు వై.హనుమంతరావు, నీటి సంఘం అధ్యక్షుడు చంద్రన్నలు ముఖ్యఅతిథులుగా పాల్గొని సరస్వతి దేవి విగ్రహం, డైనింగ్‌హాల్‌ను ప్రారంభించారు. పూర్వ ఎస్‌పీఎల్ షేక్ నబీ బాజి, సి.హెచ్.వీరాంజనేయులు, కడియాల నాగేశ్వరరావు, మానుకొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో శ్రీవారికి స్నపన తిరుమంజనం



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఫాల్గుణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని మహాలక్ష్మి అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా లక్ష్మీ అమ్మవారికి శ్రీవారికి స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. స్నపన తిరుమంజనంలో కురువేరు, తెల్లపట్టు, రంగురంగుల ఎండు ఫలాలు, వట్టివేరు, పసుపు రోజా మాలలను శ్రీవారికి అలంకరించారు. శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్యులు రామానుజ స్వామి శ్రీ, భూ, పురుష, నీలా, నారాయణ సూక్తాలను పఠిస్తుండగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం పురవీధుల్లో 40వ మాస పౌర్ణమి గరుడ వాహన సేవలో శ్రీవారు గరుడ వాహనదారుడై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఏకాంత సేవ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ ధర్మకర్తలు, శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రోసూరులో కాలిగ్రఫీ శిక్షణ

క్రోసూరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం బాలమర్రు ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం టి.శరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఉప్పాళ్ల రామోహన్‌రావు స్వచ్ఛంద సంస్థచే 500 మంది ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఇంగ్లీషు చేతిరాత మెరుగు పరచుకోవటానికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. టి.శరత్ కుమార్ ఈ కార్యక్రమ వివరాలు తెలుపుతూ క్రోసూరు, అచ్చంపేట మండలాల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. శిక్షకులుగా ప్రముఖ కాలిగ్రఫీ నిపుణులు ఉప్పాళ్ల రామ్మోహన్‌రావు, నాగమణి, జగదీష్ బాబు, ప్రియాంక పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన కాలిగ్రఫీ పోటీల్లో ఉత్తమ కాలిగ్రఫీ అవార్డు(గోల్డ్‌మెడల్) ఉపాధ్యాయురాలు గౌతమికి లభించినట్లు తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయులు పిచ్చయ్యకు సిల్వర్, స్వర్ణలతకు మూడవ బహుమతి లభించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు బోళ్ల నరసింహారెడ్డి, మంచాల మోహన్‌రావు, పిచ్చయ్య, గ్రామ ఉప సర్పంచ్ షేక్ మస్తాన్ సహకారం అందించినట్లు తెలిపారు.



కాలిగ్రఫీ శిక్షణలో పాల్గొన్న శిక్షకులు, ఉపాధ్యాయులు

భక్తిశ్రద్ధలతో నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి మహోత్సవం



అచ్చంపేట: స్థానిక సీతారామపురంలోని నిదానంపాటి లక్ష్మీ అమ్మవారు, గణపతి, ఆంజనేయ, నాగేంద్రస్వామి వార్ల ప్రథమ వార్షిక మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పెద్ది చిన్న యల్లమందరావు ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు గత రెండు రోజులుగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం నిత్య విధి మండప దేవత పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, గో ప్రతిష్ఠలు జరిగాయి. అనంతరం ధేను దర్శనం, రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి కుంకుమ బండితో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాల ప్రాంగణంలో అన్నసంతర్పణ

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం అన్నసంతర్పణ నిర్వహించారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ గాత్రం కుముదిని, కోటేశ్వరరావు దంపతుల సహకారంతో 120 మందికి అన్న సంతర్పణ నిర్వహించారు. ఒక్కొక్కరికి భోజనంతో పాటు రెండు కోడిగుడ్లను అందించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అప్పికట్ల ప్రవీణ్, డాక్టర్ సుజాత, డాక్టర్ అనూష, డాక్టర్ జీవన్ జ్యోతి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, నాయకులు పులిపాటి శ్రీరామమూర్తి, కట్టమూరి అప్పారావు, దివ్వెల శ్రీనివాసరావు, బొక్కా సంగీతరావు, గంజి వీరాస్వామి, సూరేరామ కోటేశ్వరరావు, కుంచనపల్లి శ్రీనివాసరావు, పరిమి విశ్వేశ్వరరావు, కట్టా శంకరరావు, కాగితాల గోపాలకృష్ణ, అప్పాపురపు సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ బల్లల వితరణ

పెదకూరపాడు: తాగునీటి చెరువు కట్టపై ఉదయం, సాయంత్రం వేళల్లో నడకకు వచ్చే వాకర్స్ విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా మాజీ సర్పంచ్ అర్తిమళ్ల నళిని స్మారకార్థం ఆమె భర్త పెదకూరపాడు మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్ సొంత నిధులతో 10 సిమెంట్ బల్లలు సమకూర్చారు. శుక్రవారం నడక మార్గంలోని పలు ప్రదేశాల్లో వాటిని ఏర్పాటు చేశారు. చెరువు కట్టపై నడక మార్గం అభివృద్ధికి కృషి చేసి మౌలిక వసతులు కల్పిస్తున్న రమేష్‌కు వాకర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

